# భారతీయ భవిష్యశాస్త్రం - వీరబ్రహ్మేంద్రస్వామి భవిష్యద్దర్శనం

ఆచార్య జి. అరుణ కుమారి,
హైదరాబాద్.

భవిష్యశాస్త్ర దృక్పథంలో తెలుగు సాహిత్య వీక్షణం ఒక కొత్త కోణం. భవిష్యత్తు, భవిష్యవాదం, భవిష్య శాస్త్రం అనే పదాలు తెలుగు సాహిత్యానికి కొత్తకావు. ఆరంభంలో భవిష్యత్తు అనే పదానికి నిఘంటువులు వ్యాకరణార్థాన్ని సూచించాయి. క్రమేపి కాదగినది అనే అర్థంలోను, ఆపైన వర్తమాన ప్రాగభావ ప్రతియోగి, ఆసన్నమైనది, సమీపించునది, ముందు కాబోవునది అనే అర్థాలతో ప్రయోగించారు. భవిష్యత్తును సూచిస్తుంది భవిష్యశాస్త్రం.

**భవిష్యశాస్త్రం :** శాస్త్రీయ ధోరణి, దృక్పథం, మూల్యాంకనాలతో భవిష్యత్తును సూచించే శాస్త్రం భవిష్య శాస్త్రం. ఇది భవిష్యత్తును నిర్దేశించి, దర్శించే విజ్ఞాన శాస్త్రం. వర్తమాన మూలరేఖలను భవిష్యత్తులోనికి తీసుకు వెళ్లేవి భవిష్య పరిశోధనలు. ఆధునిక కాలంలో భవిష్యత్తును గురించి ఆలోచించటమే ప్రధానం. భవిష్యత్తును గురించిన ఆలోచన లేకపోయినట్లయితే వ్యక్తి జ్ఞానానికి జీవితానికి ప్రత్యక్ష సంబంధముండదు.

**భవిష్యవాదం :** ఆధునిక ఆలోచనలో భాగమైంది. భవిష్యత్తులోనికి ఎదగడమంటే తెలిసినదాని నుండి తెలియని దానికి అతడు చేసే ప్రయాణాన్ని సూచిస్తుంది. అన్ని విజ్ఞాన విషయాలు తమలోని తపన, మథనం ద్వారానే తమకు తెలియని భవిష్యత్తుకు ప్రయాణిస్తాయి. ఈ అంశాన్ని తర్కశాస్త్రం, పరిశోధన పద్ధతులు కూడ పేర్కొంటున్నాయి. నూతన జ్ఞానావిష్కరణే భవిష్యజ్ఞానం. మన అధ్యయనాలన్నీ మానవ ప్రకృతి, అతడి పరిణామం. అతడి భవిష్యత్తు చుట్టూ తిరుగుతుంటాయి. భవిష్యవాదాన్ని పాశ్చాత్యుల సాహిత్యంలో అన్వేషించడం కంటె మన భారతీయ సాహిత్యంలో ఆవిర్భవించినందటం వాస్తవం. మన ప్రాచీన వాఙ్మయం గుణాత్మకమైంది. వాటిని పరిగణించకపోతే అవి ప్రపంచ గ్రంథాలయాల్లో ప్రదర్శనీయ గ్రంథాలుగా, ఆలంకారిక గ్రంథాలయాలుగా (మినియేచర్ లైబ్రరీగా) మిగిలి, గుప్తజ్ఞానంగా మిగిలిపోతాయి. గత చరిత్రను వెలిబూది అని, గతాన్ని విధ్వంసం చేయాలనే వాదమే భవిష్యవాదమని పాశ్చాత్యులు తెలుపుతున్నారు. 19వ శతాబ్ది ఆరంభంలో డాడాయిజమ్, సర్రియలిజం, ఇంప్రెజనిజంతో బాటు ఫ్యూచరిజాన్ని విధ్వంసక వాదంగా పేర్కొన్నారు. గత చరిత్రను, వర్తమానాన్ని సమగ్రంగా పరిగణించడం అవసరం. ఏ ఒక్కటి విస్మరించినా సంపూర్ణత్వం చేకూరదు. పురాణాలు, ఖురాన్, బైబిలు మత గ్రంథాలన్నీ రాబోయే యుగ ధర్మాలను సూచిస్తున్నాయి. మత గ్రంథాలలోని వ్యాఖ్యానాలన్నీ సృష్టి ప్రళయాన్ని తెలియజేస్తున్నాయి. ఖురాన్ ప్రపంచం అంతమవుతుందని, జాతి అంతరిస్తుందని చెపుతుంది. బైబిలు యుద్ధాలు జరుగుతాయి. అంతం వెంటనే రాదని ఊరడిస్తుంది. పురాణాలు కలియుగ ధర్మాలను వివరిస్తుంది. మధ్యయుగపు ఫ్రెంచి దేశస్థుడు నోస్ట్రడామస్ 2012న ప్రపంచం ఉత్పాతాలకు గురవుతుందని సూచించాడు. ఆకాశంలో గ్రహాలలో కలిగే మార్పుల వలన ప్రపంచం నాశనమవుతుందని, బాక్టీరియా వలన రోగాలతో జనులు మరణిస్తారని భవిష్యత్తును సూచించాడు. పాశ్చాత్యుల భవిష్యజ్ఞానంలో శాస్త్రీయ దృక్పథం



Created with Print2PDF. To remove this line, buy a license at: http://www.software602.com/

కనిపిస్తుంది. పాశ్చాత్య తత్త్వవేత్తలు భవిష్యత్తును గురించి నిర్ధారణ, అనిర్ధారణ వాదులున్నారు. భవిష్యత్తు లేదనే నిర్ధారణ వాదాన్ని మిన్‌కోస్కీ, భవిష్యత్తును ఇంకా నిర్ధారించాలి అనే అనిర్ధారణ వాదాన్ని లెక్వియర్, ఒర్గ్‌సన్, వైట్‌హెడ్ బలపరిచారు. భూత భవిష్యత్తులు వర్తమానాన్ననుసరించి మారుతాయని మార్గరెట్ మిడ్ ధ్రువపరిచారు. పాశ్చాత్యులు భవిష్యశాస్త్రాన్ని శాస్త్రీయమైన అవగాహనవైపు నడిపించారు.

భారతీయ యోగులు శ్రీ అరవిందులు, వీరబ్రహ్మేంద్రస్వామి, వేమన, సర్వజ్ఞ, సిద్ధయ్య మత, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్యాంశాలపై భవిష్యద్దర్శనం కలిగించారు. భారతీయ యోగులు, తాత్త్వికులు ఆధ్యాత్మికత, మార్మికతల మూలంగా భవిష్యద్దర్శనం చేయగలిగారు.

కాలాన్ని గురించి సాహితీవేత్తలు భిన్న భావాలను వ్యక్తం చేశారు. **I never think of the future** అని అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. భవిష్యత్తు ఎవరికీ తెలియదన్నాడు పోప్. మానవ నేత్రం చూడగలిగినంత మేరను దాటి భవిష్యత్తులో మునిగిపోతున్నాడు టెన్నిసన్. తెలుగు సాహిత్యంలోను కాలాన్ని, కాలభావాన్ని, కాల స్వరూపాన్ని, కాల ప్రభావాన్ని గురించి అనేక కవులు ప్రస్తావించారు. ఏ సాహిత్యమైనా భవిష్యత్తును వీక్షించే ప్రయత్నం చేస్తుంది.

గత కాలము మేలు వచ్చుకాలము కంటెన్ అని నన్నయ, భావి యెరిగి సెప్ప బ్రహ్మతరము కాదని దేవీ భాగవతం (దాసు), కాలతత్త్వం మిగిలి ఉంటుందని, పంచభూతాలకంటె, మనసు, బుద్ధికంటె కాలం ప్రధానమని తిక్కన మురియుదు కాలము ముందరికింకా, దిగని ప్రవాహము దిన దినమిదిగో అని అన్నమయ్య... ఇలా కాలతత్త్వాన్ని ఎందరో స్పృశించారు.

గ్రీకు తత్త్వవేత్త హిరాక్లిటస్ రోటా నేను కొత్త సూర్యుణ్ణి చూస్తున్నాను అని అన్నాడంటే భవిష్యత్తును కొత్త రూపాల్లో పరిపూర్ణతతో చూడాలని కోరుకుంటున్నాడు.

కాల తత్త్వాన్ని కవుల రచనలలో గమనించినట్లయితే ఈ విధంగా కనిపిస్తుంది.

1. గత కాలానికి ప్రాధాన్యమిచ్చే సంప్రదాయ వాదులు. 2. వర్తమానమే ప్రధానమనేవారు. 3. భవిష్యత్తును దర్శించేవారు. 4. త్రికాలాలకు సమ ప్రాధాన్యమిచ్చేవారు. 5. వర్తమానంలోనే అవిచ్ఛిన్న రూపంలో భవిష్యత్తు ఉందనేవారు. 6. భవిష్యత్తులోనే అంతా ఉందనేవారు. 7. కాలాలకు అతీతంగా భవిష్యత్తును దర్శించేవారు.

కవిత్వం కవిలోని సహజమైన ఆశల రూపం. భవిష్య కవిత్వమంతా కంటికి కనిపించేది కాదు. అది ప్రక్రియలో భాగంగా రూపొందవలసిందే. భవిష్య కవులు తమ దృష్టిని విశాలం చేసి శాస్త్రీయమైన పద్ధతిలో వర్తమాన సూచనల ద్వారా సంఘటనలను చూడగలరు. భవిష్యవాదులు శాస్త్రీయమైన మూలాలపై ఆధారపడతారు. భవిష్యవాదులలో ఒక వర్గం విజ్ఞాన శాస్త్రం ద్వారా, మరొకరు ఆధ్యాత్మికత ద్వారాను ప్రేరేపితులయ్యారు. విజ్ఞాన శాస్త్రం, ఆధ్యాత్మికత రెండూ సమతుల్యమయినపుడే దర్శనానికి పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది.



Created with Print2PDF. To remove this line, buy a license at: http://www.software602.com/

## భవిష్యత్తును దర్శించే పాశ్చాత్య పద్ధతులు

1. సంభవనీయ భవిష్యత్తు Possible future.
2. సంభావ్య భవిష్యత్తు Probable future.
3. అధిగణన భవిష్యత్తు Preferable future.

## భవిష్యత్తును దర్శించే భారతీయ పద్ధతులు

1. సమీప భవిష్యత్తు Immediate future.
2. దూర భవిష్యత్తు Distant future.

వ్యక్తి ఆలోచనలను బట్టి వైయక్తికమా, సామాజికమా అనే అంశాలు వ్యక్తమవుతాయి. యోగులు, ద్రష్టలు ప్రపంచ భవిష్యత్తును దర్శిస్తే, మానవులు భవిష్య జీవితాన్ని కాంక్షించారు. మానవునికి వర్తమానంపట్ల విశ్వాసం, భవిష్యత్తుపై ఆశ అనేవి అతి ముఖ్యమైన అంశాలు. బాహ్య చైతన్యంతో ఆగిపోకుండా అంతరాత్మ లోతుల్లోకి ప్రయాణించాలి. తనకు తెలిసిన దానినుంచి తెలియని దాని వైపుకు ప్రయాణించే నిజమైన ప్రగతి అంతరాత్మలో కనిపించాలి.

## వీరబ్రహ్మం కాలజ్ఞానం - భవిష్యద్దర్శనం

కాలగతిని తెలియ జేసేది కాలజ్ఞానం. కాలజ్ఞానం ప్రవచించే వ్యక్తి పుట్టుకకు పూర్వం ఉన్న కాలాన్ని భూతకాలంగా, ఆ వ్యక్తి సమాధి అయిన తరువాత కాలాన్ని భవిష్య కాలంగా, పుట్టింది మొదలు సమాధి అయ్యేంత వరకు వర్తమాన కాలంగా పరిగణింపబడింది. భవిష్యపురాణకర్త వ్యాసుడు, మధ్యయుగపు ఫ్రెంచి దేశీయుడు నోస్ట్రడామస్, కన్నడ దేశపు సర్వజ్ఞుడు, తెలుగుదేశపు వీరబ్రహ్మం కాలజ్ఞానులుగా ప్రసిద్ధి చెందారు. బ్రహ్మంగారికి 32 నామాలు. కాలజ్ఞానం పన్నెండు ఆశ్వాసాలుగా లభిస్తుంది. మంజరీ ద్విపద కాలజ్ఞానం చెప్పారు. 'కాలజ్ఞానమనగా భూతమును భవిష్యత్తుగా చెప్పుట జరిగిన దానిని జరగబోవునదిగా చెప్పి తన కాలమును తానే వెనుకకు ఈడ్చుకొనుట' అని రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ (వేమన పుట 107) నిర్వచించారు.

పోతులూరి వీరబ్రహ్మం వర్తమాన కాలంలో చెప్పిన అంశాలు సమీప భవిష్యత్తులో జరిగాయి. వీరు భూత భవిష్యత్ వర్తమాన కాల రాజకీయ మత సామాజికాంశాలను వివరించారు. రాజకీయ అంశాలను భూత, వర్తమాన కాలికాలుగా తెలియజేశారు. రాయపట్నాల వివరాలు, యుద్ధాలు జరుగుతాయని, తెల్లదొరలు పరిపాలిస్తారని అన్నారు.

భవిష్యదంశంగా వీరభోగవసంతరాయలు నూరు సంవత్సరాలు రాజ్యం చేస్తాడని అతడు కలియుగంలో అవతరించబోయే విష్ణువని వివరించారు.

భవిష్యదంశంగా మత భేదాలు విస్మరించి ఒకే మతంగా కలిసి మెలిసి జీవిస్తారు.

నదులలో స్త్రీలు జోలలు పాడేరు. నదులపై చెక్క ఇళ్లు నిర్మించుకుని సంసారస్త్రీలు నదులపై జోలలు పాడవలసి వస్తుందన్నారు.



Created with Print2PDF. To remove this line, buy a license at: http://www.software602.com/

స్త్రీల కన్నుల నెత్తురు కురిసేను. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను సూచిస్తుంది.

పంచాంగాలు మూలపడతాయి. వినాయకుడికి ఊరూర మంత్రాలు చదివీని.

మల్లికార్జునుని గుడిలో పొగమంటల గుళ్లలో దేవుళ్లకు మూర్తి మంతములు వచ్చి ఊరూర నాట్యమాడీని.

దేవతల కండ్ల నిప్పు, నీరు, రక్తం కారేను, రాలేను.

తిరుపతి వేంకటేశ్వర గుడిలో మ్లేచ్ఛులు ఆడిపాడీని.

అమావాస్యనాడు చంద్రోదయం పగలు నక్షత్రాలు కనిపించుట.

నల్లగాలిసోకి రాచపుండ్లు అబ్బుల బొబ్బల పుండ్లు పుట్టి చత్తురు.

ప్రజలు విచిత్ర వ్యాధులతో మరణిస్తారు. జంతువులు నాశనమై పోతాయి.

కాలజ్ఞానాన్ని మర్మ వేదాంత రహస్యం, విజ్ఞాన సంపద అని అన్నారు. కాలజ్ఞాన లక్షణాలు.

1. కాలజ్ఞానంలో చెప్పే అంశాలు ఒక సూచనతో ముడిపడి ఉంటాయి.
2. భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు సంబంధించిన సంఘటనలుగా ఉంటాయి.
3. మత రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక అంశాలు ప్రధానమైనవి.
4. కాలజ్ఞానం మౌఖిక రూపంలోను, గ్రంథస్థ రూపంలోను లభ్యం.
5. సూచనకు ఎన్నుకున్న సాక్షులు ప్రకృతి – దేవతామూర్తులు; ధ్వనులు, సూర్యచంద్ర గ్రహణాలు, రాసులు, మానవులు, జంతువులు, చెట్లు, నదులు, ఆకాశం.
6. భూతకాలాన్ని భూత భవిష్యత్ వర్తమానాలుగా; భవిష్యత్ కాలాన్ని భూత భవిష్యత్ వర్తమానాలుగా; వర్తమాన కాలాన్ని భూత భవిష్యత్ వర్తమానాలుగా పలుకుతారు. ఒకే కాలాన్ని త్రికాలాలలో వర్ణించటం.
7. భక్తి జ్ఞాన యోగాలను త్రికాలాబాధ్యమైన సకల ధర్మాలనూ వర్తమాన భవిష్యత్ కాలాల వారికి బోధించినదే కాలజ్ఞానం.

Created with Print2PDF. To remove this line, buy a license at: http://www.software602.com/